## అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ

- ఆత్యాపాత్యా చాంపియన్ షిప్‌లో బేర్నూర్(కే) విద్యార్థినికి బంగారు పతకం



సుహాసినిని సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు

సిర్పూర్(యూ), జూన్ 8 : అంతర్జాతీయ 9వ సౌత్ ఆసియన్ ఆత్యా పాత్యా చాంపియన్ షిప్ 2024-25 పోటీల్లో సిర్పూర్(యూ) మండలం భేర్నూర్ (కే) గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ గేడం సుహాసిని బంగారు పతకం సాధించింది. పశ్చిమ బెంగాల్‌లోని హసిమరలో నిర్వహించిన ఈ పోటీలోల భారత దేశంతో పాటు, నేపాల్, శ్రీలంక దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో అద్భుత ప్రతిభతో సుహాసిని గోల్డ్‌మెడల్ దక్కించుకున్నది. తన చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన సుహాసి పట్టుదలతో చదువుతూ ముందుకుసాగింది. ఆసిఫాబాద్‌లోని డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతున్న ఈమె, ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి రూ.25వేలు సాయం అందించి, ప్రోత్సహించారు. కాగా, సుహాసినిని మండల కేంద్రంలో ఆదివారం ఆదివాసీ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన గోండ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావు, జంగో లింగో ఘన్ సంస్థాన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం జగ్జీవన్, కోయ పుణ్యం, జిల్లా నాయకులు ఉర్వేత మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పటిక బెల్లం పట్టివేత



పటిక బెల్లంతో పట్టుపడిన ఆటోతో పోలీసులు

కెరమెరి, జూన్ 8 : కెరమెరి మండలం అనార్‌పల్లి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, ఆటోలో తరలిస్తున్న రూ.5 వేల విలువ గల పటిక బెల్లం పట్టుకున్నట్లు కెరమెరి ఎస్ఐ మధూకర్ తెలిపారు. కాగా, జైనూర్ మండలం అంధుగూడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ దేవిదాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా పటిక బెల్లం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

## జయప్రదం చేయండి

చెన్నూర్, జూన్ 8 : సీపీఐ చెన్నూర్ మండల మహా సభలను జయప్రదం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు చెన్నూర్‌లో ఆదివారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌలు, మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, నాయకులు సుంకరి చందు, శంకర్, తిరుపతి, దుర్గం శంకర్, నారాయణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం

శ్రీరాంపూర్, జూన్ 8 : తెలంగాణ ప్రభుత్వం మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు అన్యాయం చేసిందని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ ఆరోపించారు. నస్పూర్ ఏరియాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీ జనాభా ఉంటే మంత్రివర్గంలో కేవలం ముగ్గురికి మాత్రమే అవకాశం కల్పించడం బాధాకరమన్నారు. తమ పాలనలో సామాజిక న్యాయం జరుగుతుందని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం.. ఇంత వివక్ష చూపడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి శాఖపురి భీమ్‌సెన్, బోడంకి కుమార్, గగ్గురి రాజన్న, ఎర్రోళ్ల రాజు, పానెం పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా శంకర్

కాసిపేట, జూన్ 8 : ఆలిండియా బంజారా సేవా సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కాసిపేట మండలం సోమగూడెం(కే) గ్రామానికి చెందిన సపాట్ శంకర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. మాజీ అధ్యక్షుడు శ్యాం నాయక్, మంచిర్యాల జిల్లా తండా పూజారి బానోత్ సకలాల్ నాయక్, బోడ బలరాం నాయక్, సదానందం నాయక్, బాలు నాయక్, కుమార్ నాయక్, నందు నాయక్, లాలు నాయక్, తిరుపతి నాయక్, లక్ష్మణ్ నాయక్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం




వైద్య శిబిరం ప్రారంభంలో నిర్వాహకులు, స్థానిక నాయకులు

కాసిపేట, జూన్ 8 : కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామంలో మంచిర్యాల శంకర్ నేత్రాలయ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది రాగా, డాక్టర్ శంకర్ పరీక్షలు నిర్వహించారు. 35 మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నాయకులు రాజమౌళి, మాజీ సర్పంచ్ భూక్యా రవి, చేనవేణి పావయ్య, మాజీ ఉప సర్పంచ్ రాజయ్య, ముత్యాల కుమార్, వెంకటయ్య, సుధాకర్, నవీన్, డాక్టర్ అభిషేక్, సిబ్బంది కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ మిల్లులో ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్, జూన్ 8 : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని పర్మినెంట్, క్యాజువల్ వర్కర్స్ యునియన్ అధ్యక్షుడు అర్షద్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడంలో కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. త్వరలో మిల్లులో ఎన్నికలు నిర్వహించకపోతే వరంగల్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు.

## గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తిపై కేసు

బెల్లంపల్లి, జూన్ 8 : ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్న మండలంలోని చంద్రవెల్లి జీపీ పరిధి చర్లపల్లి గ్రామానికి చెందిన కోట్రంగి పోచన్నను ఆదివారం పట్టుకొని, కేసు నమోదు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ తెలిపారు. పక్కా సమచారం మేరకు దాడులు చేసినట్లు పేర్కొన్నారు. 8 గంజాయి మొక్కలు గుర్తించినట్లు చెప్పారు. నిందితుడి నుంచి మొక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# రహదారిపై సంత.. రాకపోకలకు చింత

- ట్రాఫిక్‌కు అంతరాయం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- ప్రమాదాలు జరుగకముందే చర్యలు చేపట్టాలి

### లక్షెట్టిపేటలో 63వ జాతీయ రోడ్డుపైనే వారాంతపు సంత

*లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఊత్కూర్ చౌరస్తా వద్ద గల 63వ జాతీయ రహదారిపై ప్రతీ గురువారం నిర్వహించే వారసంత.. ప్రయాణికులకు చింత తెచ్చిపెట్టింది. రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నది. దీంతో వర్తకులు, వినియోగదారులు, వాహనదారులు, ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రమాదకరమని తెలుస్తున్నా అధికారులు, నాయకులు, మున్సిపాలిటీ పాలకవర్గం పట్టించుకోకపోవడంతో సమస్య మరింత జఠిలంగా తయారైంది.*

**- లక్షెట్టిపేట, జూన్ 8**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఊత్కూర్ చౌరస్తా వద్ద గల 63వ జాతీయ రహదారిపైనే వారసంత నిర్వహిస్తుండడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటున్నది. రహదారికి ఇరువైపులా వ్యాపారులు, వర్తకులు, అలాగే పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లపై అమ్మకాలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగింది. గురువారం వచ్చిందంటే చాలు.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రహదారి గుండా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నెలకొన్న సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, జాతీయ రహదారిపై వారసంత ఏర్పాటు



జాతీయ రహదారిపైనే కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

ప్రమాదకరమైనదని సంతకు వచ్చే వినియోగదారులు, ప్రజలు చెబుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ పాలకవర్గం పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. సంతకు వచ్చే వర్తకులు, వినియోగదారులకు మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం కూడా లేక అవస్థలు పడుతున్నారు. వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలం లేకపోవడంతో వినియోగదారులు అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపివేస్తున్నారు. ఏదేమైనా ప్రతీ గురువారం నిర్వహించే వారసంతను ఇబ్బందిలేని ప్రదేశాలు గుర్తించి ఏర్పాటు చేయాలని, ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలని ప్రజలు కోరుతునారు.

#### వేరేచోట స్థలం కేటాయించాలి..



*కూరగాయల సంత రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల పార్కింగ్‌కు, వ్యాపారులు తమ బండ్లు పెట్టేందుకు స్థలంలేకపోవడంతో రోడ్డుపైనే నిలుపుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో ప్రతీ గురువారం సంతతో రాకపోకలకు కష్టమవుతున్నది. వేరే చోట స్థలం కేటాయించి, కూరగాయల సంతను అక్కడికి మార్చాలి.*

**- ముస్కెం సత్యనారాయణ, స్థానికుడు**

#### చర్యలు తీసుకుంటాం..



*లక్షెట్టిపేట మున్సిపాలిటీలో గురువారం వారసంత జాతీయ రహదారిపై నిర్వహిస్తున్న మాట వాస్తవమే. దీంతో ప్రజలు, స్థానికులు, వినియోగదారులు ఇబ్బందులుపడుతున్నారని మా దృష్టికి వచ్చింది. వ్యాపారులు, వినియోగదారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. స్థానిక పోలీసుల సమన్వయంతో చర్యలు చేపడతాం. సంతను అనుకూలమైన ప్రదేశానికి తరలించేందుకు ప్రయత్నం చేస్తాం.*

**- మారుతీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, లక్షెట్టిపేట**

# బెజ్జాలలో భూ కబ్జాకు యత్నం

- అడ్డుకున్న గౌడ కులస్తులు
- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు

జైపూర్, జూన్ 8 : జైపూర్ మండలం బెజ్జాల గ్రామంలో సర్వే నంబర్ 352లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ భూమిలో ఉన్న ఈత చెట్లను ఆదివారం తొలగించి ట్రాక్టర్లతో చదును చేస్తుండగా, గౌడ కులస్తులు అడ్డుకున్నారు. ఈ భూమిలో దశాబ్దాలుగా ఈత వనాలు అభివృద్ధి చేసుకొని కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. గౌడ కులానికి చెందిన వారే వారి అధికార బలాన్ని అడ్డం పెట్టుకొని భూ కబ్జాకు యత్నిస్తుండగా, గీతా కార్మికులు ఈ పరిస్థితిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. భాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌడసంఘం అధ్యక్షుడు పల్లె రాంచందర్‌గౌడ్ తనకు ఉన్న ఎకరమున్నర పట్టా భూమిని అడ్డం పెట్టుకొని సుమారు ఐదెకరాలు ఆక్రమించుకుంటున్నాడు. తాటి



బెజ్జాల గ్రామంలో కబ్జాదారులు చదునుచేసిన భూమి

జగన్‌గౌడ్ కూడా ఆధారాలు లేకుండానే పదెకరాలు, బూడిద చిన్న మల్లేశ్ ఐదెకరాలు చదును చేసుకొని కబ్జాకు పాల్పడుతున్నాడు. ఈ కారణంగా సుమారు 250 ఈతచెట్లు నరికివేసినట్లు బాధితులు వాపోయారు. ఈ స్థలంలోని ఈత చెట్లను తొలగించడం వల్ల 21 కుటుంబాలు రోడ్డున పడనున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల క్రితం ఈ భూమిని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకునేందుకు యత్నించగా, తాము అడ్డుకొని కాపాడుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు తమ కులానికి చెందిన వారే మరో దళితుడితో కలిసి కబ్జాకు పాల్పడుతున్నారని వాపోయారు. వీరికి ప్రభుత్వ అధికారులు, నాయకుల అండదండలుండడంతో మరోసారి తెరపైకి వచ్చి, కబ్జాకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. కలెక్టర్ వెంటనే స్పందించి, విచారణ చేపట్టాలని కోరారు. ఈ విషయంపై తహసీలాదర్ వనజారెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. కబ్జాపై విచారణ చేపడుతామని పేర్కొన్నారు. కబ్జాకు పాల్పడే వారు ఎంతటివారైనా చర్యలు తీసుకుంటామని వివరించారు.

#### ప్రభుత్వ భూమిని కాపాడాలి..



*మా జీవనాధారానికి కారణమైన ఈత వనం భూమిని రెవెన్యూ అధికారులు స్పందించి, కాపాడాలి. ఈ భూమిపై గ్రామంలో 21 కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. ఇప్పటికే ఈ భూమిలో ఉన్న 250 వరకు ఈత చెట్లను తొలగించారు. అనుమతులు తీసుకోకుండా భాదితుల ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండా చెట్లను నరికిన వారిపై కేసులు నమోదు చేయాలి. భూమిని రక్షించాలి, లేకపోతే గీత కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.*

**- మోతుకూరి రవీందర్‌గౌడ్**

#### గతంలో కూడా కబ్జాకు యత్నం..



*ఇదే తరహాలో కొన్నేళ్ల క్రితం నర్సింగాపూర్ (ఎస్) గ్రామానికి చెందిన కొందరు ఈ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. గీత కార్మికులందరం కలిసి పోరాడి రక్షించుకున్నాం. గౌడ కుల సంఘానికి చెందిన పెద్దమనుషులే ఈ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న పెద్దమనుషులతో సంబంధాలు పెట్టుకొని కబ్జాకు పాల్పడుతున్నారు. దీంతోపాటు, అనుమతులు లేకుండా చెట్లు నరికిన వారిపై కేసులు నమోదు చేయాలి.*

**- తాళ్లపల్లి శంకర్‌గౌడ్**

# బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలి

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం

దండేపల్లి, జూన్ 8 : బడీడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంచిర్యాల జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి అజ్మీరా పురుషోత్తం పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మూడో రోజు కొర్విచెల్మ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొర్విచెల్మ నుంచి భీమన్న గూడెం వరకు ర్యాలీ తీశారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, ఊట్నూర్‌లోని ప్రత్యేక



దండేపల్లి : కొర్విచెల్మలో అవగాహన కల్పిస్తున్న అధికారి పురుషోత్తం

పాఠశాలలో చేర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ డీఆర్పీ రెడ్డిమల్ల ప్రకాశం, కొండు జనార్దన్, నలుమాసు సుధాకర్, రావణవేణి రవి, గొంటి భూమన్న, ఆర్ శ్రీనివాస్, విజయ్‌చందర్, హెచ్‌ఎం పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కౌటాల, జూన్ 8 : మండలంలోని గుడ్లబోరి, సైదాపూర్ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎంఈవో గావుడే హన్మంతు పాల్గొన్నారు. పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు. ఆయన వెంట హెచ్‌ఎం శివాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి, జూన్ 8 : బడీడు పిల్లలతో పాటు బడిమానేసిన పిల్లలను బడిబాట పట్టించాలని కోటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బిల్ల తిరుపతయ్య, కరీం సాబీర్, సర్వాయిపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, పర్వీనా కోరారు. సర్వాయిపేటలో బడిబాట నిర్వహించారు.

#### పాఠశాల పున:ప్రారంభానికి చర్యలు..

కాగజ్‌నగర్, జూన్ 8 : కాగజ్‌నగర్ మండలం వల్లకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ చర్యలు తీసుకున్నాడు. ఈ పాఠశాల మూతబడగా, బడిబాట కార్యక్రమంలో భాగంగా పీఆర్టీయూ, టీఎస్ యూటీఎఫ్ ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. వారు స్పందించి, 12న పాఠశాల తెరుచుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు.

## ఐడియా అదుర్స్..



స్కూటీతో ఆటోను లాక్కొని వెళ్తున్న దృశ్యం

*ఓ ఆటో డ్రైవర్.. తన వాహనం క్లచ్ ప్లేట్ చెడిపోవడంతో రిపేర్ కోసం తాను ఉండే స్థలం నుంచి కౌటాల మండల కేంద్రానికి తీసుకొచ్చేందుకు చేసిన ఐడియా అదుర్స్ అనిపించింది. చింతలమానేపల్లి మండలం కొత్తగూడ-రెబ్బెన గ్రామాల మధ్య ఓ ఆటో క్లచ్ ప్లేట్ చెడిపోయి ఆగిపోయింది. దానిని రిపేర్ చేసేందుకు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కౌటాల మండల కేంద్రానికి తీసుకువచ్చేందుకు వేరే ఆటో.., ఇతర వాహనాల కోసం ఆరా తీస్తే రూ.వెయ్యి అడిగారు. దీంతో చేసేది లేక స్నేహితుడి సాయం తీసుకొని అక్కడి నుంచి తన స్కూటీతో ఆటోకు తాడు కట్టి ఇలా తీసుకొచ్చాడు.*

**– కౌటాల, జూన్ 8**

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

దహెగాం, జూన్ 8 : మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన తాళ్లపల్లి మనోజ్‌రావు ఇంటి వద్ద నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తాళ్లపల్లి మనోజ్‌రావు ఇంటి వద్ద నికిలీ విత్తనాలు ఉన్నట్లు అందిన సమాచాం మేరకు ఆదివారం పోలీసులు తనిఖీలు చేశారు. ఇంటి వద్ద 2 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని, అటవీ శాఖ అధికారి రామకృష్ణకు సమాచారం అందించారు. వారు పరిశీలించి, నకిలీ విత్తనాలని ధ్రువీకరించారు. ఆయన ఫిర్యాదు మేరకు మనోజ్‌రావుపై కేసు సమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 10 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తున్న ఎస్ఐ స్వరూప్ రాజ్

హాజీపూర్, జూన్ 8 : మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. 10 మంది ద్విచక్ర వాహనదారులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరికి సోమవారం హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, తిరుపతి, రవీందర్, రవి ఉన్నారు.

## సమ్మె జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్, జూన్ 8 : జూలై 9న చేపట్టనున్న కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి, కొన్నింటిని రద్దు చేసి యజమానులకు అనుకూలంగా ప్రధాన మంత్రి తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని సమ్మె చేపట్టినట్లు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజేందర్, మహిళా నాయకులు త్రివేణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తాండూర్, జూన్ 8 : కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా సింగరేణి పరిసర ప్రాంతాల యువతీయువకులకు ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. 18 నుంచి 25 ఏళ్లు కలిగి, కనీసం పదో తరగతి పూర్తిచేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎలాక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కూషాయిగూడా ఈసీఐఎల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏసీ, ఫ్రిడ్జిలలో గ్యాస్ చార్జింగ్, ఏసీ ఇన్‌స్టాలేషన్, వాటర్ ప్యూరిఫైర రిపేర్, వాషింగ్‌మిషిన్, డిస్‌వాషర్, ఎల్ఈడీ టీవీ, మానిటర్ రిపేర్లలో శిక్షణ ఇవ్వనున్న పేర్కొన్నారు. ఆసక్తిగలవారు 20లోగా గోలేటి జీఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి, జూన్ 8 : దండేపల్లి మండలం మామిడిపెల్లి గ్రామానికి చెందిన ముత్యపు అభిలాష్ ఇటీవల రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ద్వారా సేకరించిన రూ.94,988, జగిత్యాల వాసవి సేవాదల్ ద్వారా సేకరించిన రూ.63 వేలు మొత్తం రూ.1,57,988ను ఆదివారం అభిలాష్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు యెలుగూరి వేణు, గోలి రవీందర్, అడ్డగూరి వెంకటేశం, కొత్త రవి, శివరామకృష్ణ, మధూకర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి చదువుకు సాయం..

చెన్నూర్ రూరల్, జూన్ 8 : చెన్నూర్ మండలం రాగిపేట గ్రామానికి చెందిన నిరుపేద దుర్గం కిష్టయ్య-చిన్నక్క కొడుకు రంజిత్ చదువు కోసం ఆదివారం మాజీ వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి రూ.25వేల సాయం అందించారు. రంజిత్ ఎంబీబీఎస్ ఫస్టియర్ పూర్తి చేశబూడు. సెకండియర్ చదివేందుకు డబ్బు లేకపోవడంతో పరిస్థితి తెలుసుకున్న బాపురెడ్డి.. తన వంతుగా సాయం అందించారు. బీఆర్ఎస్ నాయకులు అండగా ఉంటారని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లెల దామోదర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రత్న సమ్మిరెడ్డి, బన్ని తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి చేయూత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లక్షెట్టిపేట, జూన్ 8 : మండలంలోని మిట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధి ముత్యంపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మిట్టపల్లి మాజీ ఉప సర్పంచ్ సాగి ఉమాపతి రావు ఆదివారం 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గంధం నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, అతని కుటుంబ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని, తమవంతు సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు రత్నం అంజి, గంధం ఏశావ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై జాప్యం తగదు

మంచిర్యాల టౌన్, జూన్ 8 : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం మరింత జాప్యం చేయడం తగదని, దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఆదివారం జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభల సన్నాహక సమావేశం, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా జర్నలిస్టుల సమస్యలు ఇప్పటివరకు పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ జాప్యాన్ని నిరసిస్తూ త్వరలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల జన చైతన్య యాత్ర చేపడుతామని ప్రకటించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, మిట్టపెల్లి మధు తదితరులు పాల్గొన్నారు.